శిథిల భవనాలే దిక్కు!

ఆమదాలవలస నియోజకవర్గంలోని పశువైద్య కేంద్రాల వివరాలు..				
మండలం	ప్రాంతీయ	మండల	గ్రామీణ	ఉప కేంద్రాలు
ఆమదాలవలస	1	5	0	19
సరుబుజ్జిలి	1	3	0	14
పొందూరు	1	2	2	27
బూర్జ	3	0	4	16

- పక్కా భవనాలు లేక తీవ్ర ఇబ్బందులుపడుతున్న సిబ్బంది
- మందులు, రికార్డులకు భద్రత కరవు
- వర్షాకాలంలో నరకయాతనపడుతున్న ఉద్యోగులు



మూతపడిన వంజంగి పశుగణాభివృద్ధి కేంద్రం

సరుబుజ్జిలి: శిథిలభవనాల్లో విధులు నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ సమయంలో పెచ్చులూడి పడిపోతాయో తెలియని పరిస్థితి. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ, ఆమదాలవలస మండలాల్లో చాలచోట్ల పశువైద్య కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి.

బిక్కుబిక్కుమంటూ..

ఆమదాలవలస ప్రాంతీయ పశువైద్య కార్యాలయం రెండు భవనాలూ శిథిలమయ్యాయి. ఆమదాలవలస మండలంలోని వంజంగి, దూసి భవనాలు అధ్వానం ఉన్నాయి. పొందూరులో తోలాపి, లోలుగు, బూర్జ మండలం అల్లెన, సరుబుజ్జిలి మండలం షళంత్రి పశువైద్య, పొందూరు మండలం పెనుబర్తి, తోలాపి భవనాలు దారుణంగా ఉన్నాయి.

భద్రతేదీ?

శిథిలభవనాలు కావడం వలన వర్షాలు కురిసే సమయంలో మందులుతడిసి ముద్దవుతున్నాయి. రికార్డులకు కూడా భద్రత లేదు. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆమదాలవలస మండలంలోని దూసి, బూర్జ మండలం అల్లెన కేంద్రాల వద్ద సరైన వసతులు లేకపోవడంతో చికిత్సకోసం పశువులను తెస్తున్న పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు.



శ్లాబు పెచ్చులూడిన షలంత్రి పశువైద్య కేంద్రం

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో పశువుల వైద్యం కోసం ప్రతీ రైతు భరోసా కేంద్రం పరిధిలోని పాడిసంపదకు సత్వర సేవలే లక్ష్యంగా ఉద్యోగుల నియామకం చేపట్టారు. నూతన భవనాలు, పూర్తిస్థాయిలో మందులు అందించేవారు.

నియోజకవర్గంలోని మూగజీవాల వివరాలు..				
మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
సరుబుజ్జిలి	9,480	88	9,456	4,059
పొందూరు	14,834	596	24,412	8,241
బూర్జ	10,560	38	11,658	2,542
ఆమదాలవలస	11,054	664	11,842	2,910

పక్కాభవనాలు నిర్మించాలి



పశు వైద్య కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. దీనివలన పాడైన భవనాల్లో సిబ్బంది విధులు నిర్వహించడం వలన వారికి ఇబ్బంది కలుగుతుంది. మందులు జాగ్రత్త చేసేందుకు సరైన సదుపాయాలు కల్పించాలి. మందుల కొరత లేకుండా చూడాలి. – **సురవరపు నాగేశ్వరరావు,** జెడ్పీటీసీ, సరుబుజ్జిలి

మందుల కొరత



పశువులకు అంటువ్యాధులు వ్యాపించిన సమయంలో అత్యవసర మందులు అందుబాటులో ఉండడంలేదు. ప్రధానంగా పశువులు ఎదకు వచ్చే సమయంలో వాడాల్సిన ఇంజక్షన్ల కొరత ఉంది. అధికారులు దీనిపై దృష్టి సారించాలి.
– **పున్నపురెడ్డి తవిటినాయుడు,** మర్రిపాడు, సరుబుజ్జిలి మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం

చాలాచోట్ల పశువైద్యకేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికే వాటన్నింటిని పరిశీలించాం. పూర్తి వివరాలతో కూడిన నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరుచేసిన తక్షణమే భవనాల పనులు ప్రారంభిస్తాం.
– **ఆర్.ఆనందరావు,** ఏడీ, పశుసంవర్ధకశాఖ

క్లుప్తంగా

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ధనుపురం పోస్టాఫీసులో విచారణ చేపడుతున్న అధికారులు

హిరమండలం: ధనుపురం పోస్టాఫీసులో జరిగిన అవకతవకలపై మంగళవారం కూడా దర్యాప్తు చేపట్టారు. పోస్టల్ ఖాతాదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం టెక్కలి డివిజన్ పోస్టల్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించారు. రెండో రోజు కూడా పోస్టల్ ఖాతాదారులతోపాటు ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. విచారణకు సంబంధించిన నివేదిక ఉన్నతధికారులకు అందజేస్తామన్నారు. దర్యాప్తు అధికారితోపాటు కొరసవాడ పోస్టల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యా సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలి



దేశవానిపేట స్కూల్లో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ

నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యా సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని డిప్యూటీ ఈఓ విజయకుమారి సూచించారు. స్థానిక బాలికోన్నత పాఠశాల, దేశవానిపేట ఉన్నత పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యత పెంచాలని వంట మహిళలకు ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఇప్పటి నుంచే ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, సిలబస్ తొందరగా పూర్తి చేయాలన్నారు. ఈ నెలాఖరు నాటికి డైస్ యాప్‌లో విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంఈఓ శాంతారావు, తదితరులు ఉన్నారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక



ధీరజ్‌ను అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ హరినారాయణ

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి (సెకెండ్ లిస్ట్) రొట్టవలస కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి చాపర ధీరజ్ ఎంపికైనట్లు విద్యా సంస్థ కరస్పాండెంట్ బెవర హరినారాయణ మంగళవారం తెలిపారు. విద్యార్థి స్వగ్రామం ఎల్.ఎన్.పేట మండలంలోని బొర్రంపేట. విద్యార్థిని కరస్పాండెంట్, స్కూల్ ప్రిన్సిపాల్ బెవర కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేడు దంత వైద్య శిబిరం

నరసన్నపేట: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సర్పంచ్ బి.శంకర్, వార్డు సభ్యుడు ఆర్.శ్రీధర్(బుజ్జి) మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి దంత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దంత సమస్యలతో బాధపడుతున్న రోగులు వచ్చి తనిఖీలు చేయించుకోవాలని కోరారు.

శ్రీముఖలింగంలో నిత్యాన్నదాన పథకం లేదు



నాయుడుగారి రాజశేఖర్

శ్రీకాకుళం అర్బన్: జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం మహాక్షేత్రంలో నిత్యాన్నదాన పథకం లేదని, ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆలయ ప్రధాన అర్చకుల్లో ఒకరైన నాయుడుగారి రాజశేఖర్ అన్నారు. శ్రీకాకుళంలోని ఎన్జీఓ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. నిత్యాన్నదానం పేరుతో ఎటువంటి విరాళాలు ఆలయ ఈఓకు, ఇతర కమిటీ సభ్యులకు చెల్లించి మోసపోవద్దన్నారు. మూడేళ్లుగా నిత్యాన్నదానం పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆలయ ఈఓకు పలుసార్లు ఈ విషయం తెలియజేశానన్నారు. ఆయన అండదండలతోనే లేని నిత్యాన్నదాన పథకానికి రూ.కోట్లలో విరాళాలు అందుతున్నాయన్నారు. ఇదంతా స్వామి వారి పవిత్రతకు, భక్తుల మనోభావాలకు ఆటంకాలు కలిగించటమేనన్నారు. భక్తులు స్వయంగా ఆలయానికి వచ్చి వారికి తోచిన విధంగా ఏదో ఒక రూపంలో ఆలయ ప్రాంగణంలో మాత్రమే సేవలందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆఫ్ లైన్ టికెట్ల అమ్మకం సరికాదన్నారు. ఇప్పటికైనా ఆన్‌లైన్ టిక్కెట్లను జారీ చేసి ఆలయ ప్రతిష్టతను ఇనుమడింపజేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జలుమూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.సుజాత అన్నారు. మంగళవారం టి.లింగాలపాడు పంచాయతీ పరిధి సంతలుబైలు గ్రామంలో స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించారు. భోజనం చేసే ముందు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు.

వేడినీరు, తాజా ఆహారం తీసుకోవాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీహెచ్ఓ పద్మావతి, హెచ్‌వీ లలితాంబ, పర్యవేక్షకుడు చిన్నరాజులు, సహాయకులు చిన్నారావు, ఆరోగ్య కార్యకర్తలు రూప, నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

సచివాలయ సిబ్బంది నిరసన



నరసన్నపేట: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

నరసన్నపేట: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమస్యలు పరిష్కరించాలని, పని ఒత్తిడి తగ్గించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు నరసన్నపేట ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్‌కు మంగళవారం రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు వినతిపత్రమిచ్చారు. సంఘం ప్రతినిధులు ప్రశాంత్, సురేష్ మాట్లాడుతూ ప్రమోషన్ చానల్ ప్రకటించాలని, రేషనలైజేషన్ విధివిధానాలు స్పష్టం చేయాలని, క్లస్టర్ విధానం అమలు చేస్తే మిగిలిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఏం చేస్తారనేది ముందుగానే ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సారవకోటలో..

సారవకోట: మండలంలోని అన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మంగళవారం నల్ల బ్యాడ్జీలు కట్టుకుని నిరసన తెలియజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

పోలాకిలో..

పోలాకి: తమకు న్యాయంగా అందాల్సిన వసతులను అందించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయం సిబ్బంది మండల పరిషత్ కార్యాయలం వద్ద నిరసన చేపట్టారు. బదిలీల్లో సొంత మండలాల్లో అవకాశం కల్పించటంతోపాటు, పలు సమస్యలను తెలియపరుస్తూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

పొందూరులో..

పొందూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులకు స్థానిక మండలాల పరిధిలోనే బదిలీలకు అవకాశం కల్పించాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. పలువురు ఏఎన్ఎంలు కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు స్థానిక మున్సిపాలిటీల్లోనే బదిలీలకు అవకాశం కల్పించారని, గ్రామ సచివాలయ ఉద్యోగులకు మాత్రం మండల పరిధిలో బదిలీలకు అవకాశం కల్పించలేదన్నారు. ఒకే శాఖకు చెందిన ఉద్యోగులకు రెండు రకాలుగా నిబంధనలు ఉండడం సమంజసం కాదన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు సొంత మండలంలోని మరో సచివాలయానికి బదిలీ చేయాలని కోరారు. మండలంలోని కురిగాం పీహెచ్‌సీ ముందు మండలంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు నిరసన వ్యక్తం చేశారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ తిరుపతి పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెద్దింటి స్వాతి, మజ్జి గౌరిబాబు, కె.సింహాచలం, సి.హెచ్ లక్ష్మణరావు, డి.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పలువురు ఎంపిక

నరసన్నపేట: మండలంలోని వివిధ ప్రభుత్వ స్కూళ్ల చదివి పదో తరగతిలో మంచి మార్కులు పొందిన 13 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు రావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సప్ప ప్రవీణ్, తోట హర్షవర్ధన్ దేవ్, సత్యవరం స్కూల్ విద్యార్థి పొట్నూరు ధనుష్, కంబకాయ స్కూల్ విద్యార్థులు పట్ట సురేష్, బుద్దల సుష్మిత, గుజ్జల మోహిత్, మాకివలసలో నేతింటి శ్యామల, సుందరాపురం స్కూల్ విద్యార్థి టి.దీక్షిత, మడపాం విద్యార్థులు రెడ్డి దీపిక, రుప్ప రోజా, కీర్తక, చందన, నరసన్నపేట బోర్డు స్కూల్ నుంచి కె.మణి, పి.జ్యోషిత ఎంపికయ్యారు.

సారవకోట మండలంలో..

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ నుంచి 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ రమణ తెలిపారు. చిన్నకిట్టాలపాడు పాఠశాలకు చెందిన ముంజేటి యువశ్రీ, యర్నాగుల ఆకాశ్, సి.హెచ్.తనూజ, బుడితి పాఠశాల నుంచి పంగ ఉదయశ్రీ, పాటోజు భువన, కేజీబీవీ నుంచి ఎన్.హన్షిక, అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తంగి హేమంత్, కొల్లి శ్రీలత ఎంపికయ్యారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.లోకేష్, టి.ఉదయ్‌కుమార్, బి.హరిణి, ఎల్.లావణ్య, శ్రావ్య ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. హెచ్ఎం లక్ష్మీనరసింహం, ఉపాధ్యాయులు అభినందించారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పెనగొండ గౌతమ్, నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కె.హర్షవర్ధన్, బోడసింగి వంశీ ఎంపికయ్యారు. ఆయా పాఠశాల హెచ్ఎంలు అభినందించారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పదో తరగతి విద్యార్థిని చీపురి యామిని నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పాఠశాలలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. హెచ్ఎం కె.ఎ.రాములు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి గొంటి గిరిధర్ యామినికి అభినందనలు తెలిపారు. ఎన్‌సీసీ అధికారి బి.శరత్ కుమారి యామినిని ప్రత్యేకంగా అభినందించి రూ.3 వేల నగదు బహుమతిగా అందించారు.

హిరమండలంలో..

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన షర్మిల పూజిత, భరత్, హారిక ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం టి.కేశవరావు అభినందించారు.

శిష్టకరణ సంఘం మండల అధ్యక్షుడిగా అశోక్



పాతపట్నం: శిష్టకరణ సంఘం మండల అధ్యక్షుడిగా ప్రహరాజపాలెం గ్రామానికి చెందిన రావాడ అశోక్ పట్నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన మంగళవారం తెలిపారు. కార్యదర్శిగా బెహరా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా రఘుపాత్రుని తులసీరావు, సహాయ కార్యదర్శిగా తొనంగి రాజశేఖర్ పట్నాయక్, కోశాధికారిగా కంటుమహంతి జీవేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా బెహరా శ్రీను, రాము పట్నాయక్, లింగు మహంతి శ్రీను, తవుడు బాబు, రావాడ కృష్ణ, చక్రమహంతి రాజు, వెంకుమహంతి, మహేష్, రాంబాబు లను ఎన్నుకున్నట్లు చెప్పారు. అధ్యక్షుడు అశోక్ పట్నాయక్‌ను పలువురు అభినందించారు.

అభినందన..



మోఘనా మోహన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు

పాతపట్నం: మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కొమరాపు మేఘనా మోహన్ ఒంగోలులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.గంగాధర్ మంగళవారం తెలిపారు. పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మోఘనా మోహన్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మోఘనా మోహన్ పదో తరగతిలో 595 మార్కులు సాధించి, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చేతులమీదుగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన షైనింగ్ స్టార్స్ అవార్డును అందుకుందన్నారు. అభినందించిన వారిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కక్ష సాధించేందుకే తప్పుడు కేసులు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధించేందుకే కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన ఏడాది పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎటు పోతున్నాయో తెలియని దుస్థితి నెలకొందన్నారు. మంత్రి లోకేష్ రూపొందించిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, సామాన్యులకు సైతం భద్రత లేదన్నారు. దాడులు, హత్యలు, ఆరాచకాలు రాష్ట్రంలో నిత్యకృత్యం అయిపోయాయన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రక్షణ లేకుండా పోయిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు భద్రత కల్పించటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. జగనన్న పర్యటనలో ప్రోటోకాల్ లేకపోవడం, సరైన భద్రత కల్పించలేకపోవటం కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ అధినాయకుడు నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు.

బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలి

- ఇంటి పన్ను వసూలుపై అలసత్వం తగదు
- నరసన్నపేట మేజరు పంచాయతీ పాలకవర్గం సమావేశం



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ అధికారులు, వార్డు సభ్యులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేట ఆదాయం పెంచేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఇంటి పన్ను అధికంగా బకాయి ఉన్న వారికి నోటీసులు ఇవ్వాలని పంచాయతీ ఈఓకి వార్డు సభ్యులు కోరారు. మంగళవారం సర్పంచ్ బూరల్లి శంకర్ అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. వార్డు సభ్యులు బి.ఎల్.శర్మ, ఆర్.శ్రీధర్ (బిజ్జి), కె.సి.హెచ్.బి.గుప్త, పి.కృష్ణ ప్రసాద్, రామారావు, సతీష్ పన్ను బకాయిలపై పంచాయతీ సిబ్బందిని నిలదీశారు. బ్యాంకులతోపాటు ఇతర వాణిజ్య సంస్థలకు సంబంధించి అధిక మొత్తంలో బకాయిలు ఉన్నాయని ఈఓ ద్రాక్షాయిని వివరించారు. రూ.5 లక్షలు దాటి అనేక మంది బకాయిదారులు ఉన్నారన్నారు. లక్ష రూపాయలు దాటిన పన్ను బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు తీర్మానం చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఉంటూ వ్యాపారాలు చేస్తున్న వారి నుంచి ఆక్రమణల పన్ను వసూలు చేయాలని, దీంట్లో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఆశీల వేలం పాటదారుల నుంచి ముందస్తు చెక్కులు తీసుకోవడంలో జాప్యంపై నిలదీశారు. సత్యవరంలో అపారిశుద్ధ్యం తొలగింపుపై సిబ్బంది పనితీరు బాగులేదని వార్డు సభ్యులు నీలం, సీర లక్ష్మీనారాయణ ఈఓ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశం అజెండాపై చర్చించకుండానే శనివారానికి వాయిదా వేశారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు



ఆస్పత్రి ముందు రోడ్డు నిర్మాణానికి వేసిన మెటీరియల్

నరసన్నపేట: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి ముందు రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. సాక్షిలో గత నెల 29న చెరువులు కాదు రోడ్లే అనే వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీసీహెచ్ కల్యాణ్‌బాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్యప్రసాద్, తదితరులు మే 30న ఆసుపత్రికి వచ్చి పరిస్థితులను సమీక్షించారు. ఆసుపత్రి ముందు బరదమయంగా ఉన్న రోడ్డును చూసి ఆందోళన చెందారు. నెల రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈ మేరకు కాంట్రాక్టర్ మూడు రోజుల క్రితం పనులు ప్రారంభించి రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. మొక్కుబడిగా కాకుండా నాణ్యతగా పనులు చేయాలని రోగులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.


చెరువులు కాదు.. రోడ్లే

సాక్షిలో మే 29న ప్రచురితమైన వార్త

అందరి కృషితోనే అభివృద్ధి సాధ్యం




మాట్లాడుతున్న ఎంపీపీ కర్నేన దీప

బూర్జ: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంతో మంగళవారం ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఎంఈఓలు ఎస్.శ్యామ సుందరరావు, బి.ధనుంజయరావు మాట్లాడుతుండగా పలువురు సభ్యులు కలుగజేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులు గ్రామాల్లో అవగాహన కల్పించలేదన్నారు. 1, 2వ తరగతుల్లో ప్రవేశాలు లేవన్నారు. మండలంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తిగా ఎత్తివేశారన్నారు. అల్లెన పాఠశాలలో సుమారు 70 మంది విద్యార్థులు ఉన్నా ఎత్తివేసి పాలవలసలో కలిపారన్నారు. విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్లు కూడా అందజేయడం లేదన్నారు. ఉపాధి ఏపీఓ రవి మాట్లాడుతుండగా సభ్యులు కలుగుజేసుకున్నారు. ఇటీవల విధులు నిర్వహించిన ఫీల్డ్‌అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, గ్రామ పెద్దలు, సర్పంచ్, ఎంపీటీసీకి పిలవకుండా గ్రామ స్థాయిలో సామాజిక బృందం సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ నెల 25న మండల కేంద్రంలో నిర్వహించనున్న సోషల్ ఆడిట్ వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఓనిగెడ్డ రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టును రైతులు నష్టపోతున్నారని సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ వై.వి.పద్మావతి, ఎస్ఐ ఎం.ప్రవళిక, వైస్ ఎంపీపీలు కరణం కృష్ణంనాయుడు, బుడుమూరు సూర్యారావు, సర్పంచ్ ఏగు అనురాధ, వైద్యాధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బాధ్యతల స్వీకరణ



డాక్టర్ పాపారావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా డి.పాపారావు మంగళవారం విధుల్లోకి చేరారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ కొన్ని నెలల క్రితం ఉన్నత చదువుల కోసం వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పాపారావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. డాక్టర్‌కు ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొత్తూరు: మండలంలోని మహసింగి గ్రామ దళితులకు చెందిన శ్మశానాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. శ్మశానం ఆక్రమణలకు గురైనట్లు గ్రామానికి చెందిన పైడి కులస్తుల జిల్లా సంఘం అధ్యక్షుడు పసుపురెడ్డి అశోక్ కుమార్‌తోపాటు పలువురు తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై తహసీల్దార్ స్పందించారు. ఆక్రమణలకు గురైన శ్మశానాన్ని సర్వే చేసి దళితులకు అప్పగించాలని వీఆర్వో గిరీష్‌కుమార్, గ్రామ సర్వేయర్‌కు ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది శ్మశానాన్ని సర్వే చేసి ఆక్రమణలను తొలగించారు. హద్దులు నిర్ణయించారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ అందిస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ పంచాది రాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. మహిళలతో మాట్లాడి కుట్టు నేర్పుతున్న విధానాలపై ఆరా తీశారు. మహిళలకు ఇదొక మంచి అవకాశమన్నారు. మూడు నెలలపాటు కుట్టు నేర్చుకుంటే ఇంటి వద్ద ఉపాధి పొందవచ్చన్నారు. కుట్టు నేర్చుకున్న మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తుందన్నారు. ఎంపీడీఓ రోణంకి వెంకటరావు, కార్యాలయ పర్యవేక్షకులు వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రమేష్ పట్నాయక్

ఆమదాలవలస: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలని మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రమేష్‌పట్నాయక్ డిమాండ్ చేశారు. జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల మద్దతు ఇవ్వాలన్నారు. మంగళవారం పట్టణంలోని మోణింగి వారి వీధిలో మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. గతకొద్ది రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో పోరాటాలను ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. మున్సిపల్ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బలరాం, మున్సిపల్ కార్మికుల సంఘ అధ్యక్షుడు తాడి సంతోష్, కార్యవర్గ సభ్యులు కె.తారకేశ్వరరావు, కె.వెంకటరావు, ఎన్.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎల్.ఎన్.పేట/హిరమండలం: ఈ నెల 26వ తేదీన విద్యుత్ శాఖ వార్షిక ట్రాన్స్‌ఫార్మర్ల తనిఖీలు చేపట్టనున్నారు. హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు హిరమండలం మండలానికి, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఎల్.ఎన్.పేట మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించటం వలన అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఓ కొర్ను సింహాచలం అన్నారు. మండలంలోని మిరియాపల్లి, దబ్బపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులతో సమావేశమయ్యారు. మట్టి సమూనా పరీక్షలు, విత్తన మార్పిడి, విత్తన శుద్ధి, కలుపు నివారణ, ఎరువులు, పురుగు మందులు వినియోగం, సాగునీటి యాజమాన్య పద్ధతులు ఎంతో ముఖ్యమన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా సాగు చేయాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.